వ్యవసాయ పెట్టుబడికి ఇబ్బందిగా ఉంది



నాకున్న కొంత పొలంలో వరి సాగు చేస్తున్నా. ట్రాక్టర్‌తో దమ్ము చేయడానికి, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలంటే, డబ్బులు లేక ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది. గత ప్రభుత్వ పాలనలో రైతు భరోసా కింద ప్రతి ఏడాది రూ.13,,500 సాయం అందేది, కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేలు అందిస్తే బాగుంటుంది.

– బొల్లు వెంకట సత్యనారాయణ, రైతు, కామవరపుకోట మండలం

నిరుద్యోగ భృతి ఎప్పడిస్తారు..?



ఉద్యోగాల భర్తీకి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అప్పటివరకు నిరుద్యోగులకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయాలి. దీంతో తల్లితండ్రులపై ఆధారపడకుండా ఉద్యోగ ప్రయత్నాలకు ఈ సొమ్ములు ఉపయోగపడుతాయి. అలాగే 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి. ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి.

– షేక్ రబ్బాని, జంగారెడ్డిగూడెం

తల్లికి వందనం ఆలస్యం చేస్తే ఎలా..?



తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి తల్లుల ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఈ పథకాన్ని ఆలస్యం చేయకుండా త్వరగా అమలు చేస్తే పిల్లల చదువుకు బాగా ఉపయోగపడుతుంది. ఆలస్యం చేయడం వలన పిల్లల ఫీజులు కట్టడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఈ పథకాన్ని అమలు చేయాలి.

– రమణ, పంగిడిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం

తల్లికి వందనం కోసం ఎదురుచూపులు



తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు అందిస్తే పేద విద్యార్థులకు ఆర్థికంగా అండగా ఉంటుంది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున డబ్బులు వేస్తామని తల్లులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది పాఠశాల ప్రారంభమయ్యే నాటికే విద్యార్థులకు దుస్తులు పాఠ్య పుస్తకాలు అందించడంతో పాటు అమ్మ ఒడి అందించేవారు.


– మేరుగు బాబురావు, కామవరపుకోట మండలం

మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఎప్పటినుంచి ఇస్తారో ప్రభుత్వం ప్రకటించాలి. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రకటించిన ఈ పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పథకాన్ని త్వరగా ప్రారంభించి మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

– ఎస్‌కే రజియా, చింతలపూడి



సూపర్ సిక్స్.. అంతా తుస్..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలన్నర దాటినా సూపర్‌సిక్స్ పథకాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. ఒక పక్క పాఠశాలలు తెరుచుకున్నా, మరో పక్క ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అమ్మకు వందనం, అన్నదాత పథకాల గురించి ప్రభుత్వం నోరుమెదపడం లేదు. అంతేకాకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికీ సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు నెలకు రూ.1500 గురించి ఎక్కడా కూటమి ప్రభుత్వం ప్రస్తావించడం లేదు. దీంతో ఈ పథకాలన్నీ హుళక్కేనా అని ప్రజలు అయోమయంలో పడ్డారు. అదే గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గత ఐదేళ్లలో నూరు శాతం అమలు చేసి చూపించింది. దీంతో సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

– పోలవరం చింతలపూడి

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1500

పోలవరం నియోజకవర్గంలో
అర్హులైన మహిళల సంఖ్య –1,25,815
వీరికి నెలకు ఇవ్వాల్సిన సహాయం రూ. 18.87 కోట్లు

చింతలపూడి నియోజకవర్గంలో
అర్హులైన మహిళల సంఖ్య 1,13,178
వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం రూ. 16.97 కోట్లు


జగన్ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
రైతు భరోసా	పోలవరం	రూ.54.37 కోట్లు
రైతు భరోసా	చింతలపూడి	రూ.61.17 కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందాల్సిన సాయం

అన్నదాత సుఖీభవ	పోలవరం	రూ.81.35 కోట్లు
అన్నదాత సుఖీభవ	చింతలపూడి	రూ.90.62 కోట్లు



యువతకు నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి

పోలవరం నియోజకవర్గంలో
అర్హులైన యువత : 1,12,210
వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం రూ. 33.66 కోట్లు
చింతలపూడి నియోజకవర్గంలో
అర్హులైన నిరుద్యోగ యువత : 90,000
వీరికి నెలకు ఇవ్వాల్సిన సాయం రూ.27 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
అమ్మ ఒడి	పోలవరం	రూ.133.83 కోట్లు
అమ్మ ఒడి	చింతలపూడి	రూ.37.65 కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందాల్సిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
తల్లికి వందనం	పోలవరం	రూ.168,90 కోట్లు
	చింతలపూడి	రూ.78.51 కోట్లు

నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత తప్పదు



కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా సూపర్‌సిక్స్ హామీల పేరుతో నిరుద్యోగులకు భృతి ఇస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పట్టించుకోవడంలేదు. ఉద్యోగ అవకాశాలు కల్పించండి.. లేదా రూ.3000 నిరుద్యోగ భృతి చెప్పిన హామీమేరకు ఇవ్వాలి. లేకపోతే నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత చవి చూడక తప్పదు.

– ఎస్. రామ్మోహన్‌రావు, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బుట్టాయగూడెం

నిరుద్యోగ భృతి ఎప్పడిస్తారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని, మెగా డీఎస్సీతో ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి. ఉద్యోగం లేని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలి.

వీరమళ్ళ ప్రవళిక, వింజరం(గ్రామం), కుక్కునూరు

క్లుప్తంగా

ఘనంగా వెదురు దినోత్సవం

కొయ్యలగూడెం: మేదర కులస్తులు గర్వపడేలా వెదురు దినోత్సవం నిర్వహించడం శుభ సూచకమని మాజీ ఎంపీపీ మట్టా సత్తి పండు పేర్కొన్నారు. బుధవారం గవరవరంలో వెదురు దినోత్సవాన్ని మేదర కులస్తులు నిర్వహించగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏలూరు జిల్లాలోని అతిపెద్ద సంఘంగా మేదర కులస్తులు కొయ్యలగూడెంలో ఉన్నారని వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు అంకోలు క్రాంతి కుమార్, కార్యదర్శి జొరిగే రామ మోహన్‌రావు, కోశాధికారి చందా కోటేశ్వరరావు, కోడే శోభనాద్రి, తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య వరద వీడింది

వేలేరుపాడు: మూడు నెలలుగా వణికించిన గోదావరి ఎట్టకేలకు శాంతించడంతో దిగువ ప్రాంత గ్రామాల గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పూర్తిగా తగ్గటంతో వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే రహదారిలో ఎద్దెల వాగు వంతెన బుధవారం బయటపడింది. దీంతో 17 రోజులుగా జల దిగ్బంధంలో ఉన్న గ్రామాలకు విముక్తి లభించింది. మిగతా మూడు నెలలు పడవ ప్రయాణమే ఆ గ్రామాలకు దిక్కయింది. ప్రస్తుతం వంతెన ప్రాంతంలో గోదావరి ఒండ్రు మట్టి పేరుకుపోయింది. అధికారులు స్పందించి ఒండ్రు మట్టిని తొలగించాలని గిరిజనులు కోరుతున్నారు.

శశికుమార్‌ను పోక్సో చట్టంలో శిక్షించాలి

కొయ్యలగూడెం: ఆశ్రమ బాలికలపై అఘాయిత్యానికి పాల్పడిన శశి కుమార్‌పై పోక్సో చట్టం అమలు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏలూరు దయానంద సరస్వతి సేవా ఆశ్రమంలో శశికుమార్ అనే వ్యక్తి ఆశ్రమంలోని బాలికలపై అఘాయిత్యాలు చేయడం అమానుషమన్నారు. సతీష్ కుమార్‌తో పాటు ఆమె భార్యపై కేసు నమోదు చేసి విచారణ చేయాలన్నారు. బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. స్థానిక రావూరి జంక్షన్ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12,600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

చింతలపూడి: గర్భిణులు, పిల్లల తల్లులు పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ పీవో పి.మాధవి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమంలో మాధవి మాట్లాడుతూ బాలింతలకు, తల్లులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ పి.లీలాకుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: పోషణ మాసోత్సవాలు సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మండలంలోని కొమ్ముగూడెం, ఇటికిలకోట, వింజరం పంచాయతీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.రాణి తెలిపారు.

ద్వారకాతిరుమల: సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని ద్వారకాతిరుమల-2 సచివాలయం



గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న దృశ్యం

మహిళా పోలీస్ లక్ష్మీసుజన అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి గర్భిణులకు, బాలింతలకు, రెండేళ్లలోపు పిల్లల పోషణ, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమం బుధవారం కన్నాపురం గ్రామంలో నిర్వహించారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఎ.నయోమీరాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రాజెక్టు ఆఫీసర్ తులసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్‌కే బాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, వరలక్ష్మీ, గంగారత్నం, దేవి కుమారి, శారద పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని ఎ.పోలవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పిండి వంటకాల స్టాల్‌ను సెక్టార్ సూపర్ వైజర్ కె.లక్ష్మి వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.చిన్ని, ఎం.రామానుజమ్మ, కె.రత్నకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ఉమాదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అశోక్ శ్రీనివాస్‌కు ఘన నివాళి

కామవరపుకోట: ఇటీవల మృతి చెందిన కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మేడవరపు అశోక్ శ్రీనివాస్‌కు పలువురు రాజకీయ నాయకులు నివాళులర్పించారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, కరాటం రాంబాబు, కామవరపుకోట జెడ్పీటీసీ కడమి రమేష్, ద్వారకాతిరుమల జెడ్పీటీసీ చిగురుపాటి శామ్యూల్, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలాకాంతం గంగరాజు, చెలికాని రాజబాబు, ప్రతాప్ నేనివాసు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అశోక్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్

కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగడ సానుభూతిని తెలియజేశారు.

వైభవంగా గణపతి హోమం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక గ్రంథాలయ సమీపంలో శ్రీ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మందిరంలో బుధవారం గణపతి హోమం నిర్వహించారు. గణపతి విగ్రహాలను ఊరేగించి, పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు.

అక్కా చెల్లెళ్లకు బంగారు పతకాలు

జంగారెడ్డిగూడెం రూరల్: కరాటేలో మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 14,15 తేదీల్లో ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆవరణలో నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అక్కా చెల్లెళ్లు చిలుకూరి ఉద్విత, సోనాక్షి బంగారు పతకాలను సాధించినట్లు శిక్షకుడు ఈశ్వర్ తెలిపారు. విద్యార్థులను లక్కవరం ఏఎస్సై ఐ.భాస్కరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ దల్లి దుర్గారెడ్డి, తదితరులు అభినందించారు.

ఆయిల్‌పాంకు మద్దతు ధర ప్రకటించాలి

ద్వారకాతిరుమల: ఆయిల్‌పాం టన్ను గెలలకు రూ.18 వేలు మద్దతు ధర ప్రకటించి, ఆయిల్‌ఫాం రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు డిమాండ్ చేశారు. ఉత్పత్తి ఖర్చుల ఆధారంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఆయిల్‌ఫాం రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు.

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి వారి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం కావడంతో మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో బుధవారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు మంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ద్వారకాతిరుమల: రేషన్ బియ్యం అక్రమ రవాణాను సివిల్ సప్లై అధికారులు మండలంలోని మారంపల్లి పంచాయతీ లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై బుధవారం అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ద్వారకా తిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంకు చెందిన ఉన్నమట్ల వెంకటరమణ, చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన నున్నా రమేష్ వద్ద రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన చిక్కాల సత్యన్నారాయణ సహాయంతో తన వ్యాన్‌లో మండపేటలోని శ్రీ వైష్ణవి హోటల్ యజమాని బాబ్జీకి విక్రయించేందుకు తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న సివిల్ సప్లై డీటీ ఎ.మాధవరావు ఈ అక్రమ రవాణాను అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకట రమణ, రమేష్, సత్యనారాయణ, బాబ్జీలపై కేసు నమోదు చేసి, రూ.2,33,600 విలువైన 58.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రూ. 8లక్షల విలువైన వ్యాన్‌ను సీజ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

జంగారెడ్డిగూడెం/పోలవరం రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణలో గోనె సంచులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెం మండలం కేతవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జంగారెడ్డిగూడెంలోని విష్ణుప్రియ రైస్ మిల్లు, ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను, పోలవరం మండలంలోని గూటాల 2 (కొత్త పట్టిసీమ) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోనె సంచులు నిల్వ చేసేందుకు గోడౌన్లను సిద్ధం చేస్తున్నామని గోదాముల సన్నద్ధతను పరిశీలిస్తున్నామన్నారు. జేసీ వెంట జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజూ భార్గవి, డీఎస్‌వో ఆర్‌ఎస్‌ఎస్ రాజు, తహసీల్దార్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో చండీ హోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో భాద్రపద పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని 67వ చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ చండీ హోమం గురించి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కే.ఎల్.ఎన్.ధన కుమార్ మాట్లాడుతూ ఆలయం ప్రతిష్ట చేసిన నాటి నుంచి నేటి వరకు శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠ నిర్వాహకులు బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి నిర్దేశించిన ప్రకారం ప్రతి పౌర్ణమికి చండీ హోమాన్ని నిర్వహిస్తామన్నారు. బుధవారం 2024 దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ (పందిరి రాట ముహూర్తం) నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షులు రాజాన సత్యనారాయణ తెలిపారు

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం: సీఐటీయూ శిక్షణ తరగతులు సెప్టెంబర్ 21 22 23 తేదీల్లో గురవాయిగూడెం పంచాయతీ మానవత హాల్ నందు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు లింగరాజు తెలిపారు. లింగరాజు మాట్లాడుతూ ఈ సమావేశానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎల్లా వెంకటేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌కే సుభాషిణి, బి.బాలరాజు, సునిల్, పి.సత్తిబాబు, రాంబాబు, ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసిన శ్రీ పంచభూత మరకత లింగేశ్వర సహిత శ్రీ చక్ర సమన్విత శ్రీ విజయ దుర్గ దేవాలయంలో శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుదర్శనం వేణుగోపాలాచార్యులు పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్, వందనపు అప్పలరాజు, యర్రం ఉదయ్ కుమార్, జల్లేపల్లి శివకృష్ణ, వీరవల్లి శ్రీనివాసరావు, దూసనపూడి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎర్రచందనం రైతులకు న్యాయం చేయాలి

టి.నరసాపురం: ఎర్రచందనం సాగు రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని రైతులు కోరారు. మండలంలోని కొల్లివారిగూడెంలో రైతు సిరిమళ్ల సూర్యప్రకాష్‌కు చెందిన ఎర్ర చందనం తోటలో మండలంలోని మక్కినవారిగూడెం, కృష్ణాపురం, గంగినీడుపాలెం గ్రామాలకు చెందిన రైతులు బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతులు సిరిమళ్ల సూర్య ప్రకాష్, ముళ్లపూడి రఘురాం, సిరిమళ్ల వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ఎంపీపీ

పోలవరం రూరల్: పోలవరం డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.వెంకటేశ్వరరావును బుధవారం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువ కప్పి అభినందనలు తెలిపారు. ఎంపీపీ వెంట పోలవరం సీఐ సురేష్‌బాబు ఉన్నారు.

నేడు మెక్సికో బృందం పర్యటన

ద్వారకాతిరుమల: ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల పరిశీలనలో భాగంగా ఏలూరు జిల్లా విచ్చేసిన మెక్సికో దేశ ప్రతినిధి బృందం గురువారం ద్వారకాతిరుమల మండలంలో పర్యటిస్తుందని అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తారని తెలిపారు.